క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఘనంగా పునర్వసు నక్షత్ర హోమం



హోమం చేస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో సోమవారం హోమాన్ని ఘనంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ఉన్న మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను జరిపారు. విశేష హారతులు అందించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఉమాచంద్రమౌళేశ్వరుడికి విశేష పూజలు



ఉమాచంద్రమౌళేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

జాతీయ విలువిద్య పోటీలకు తేజేశ్వరరావు



తేజేశ్వరరావుతో పాఠశాల యాజమాన్యం

పరవాడ: కోల్‌కతాలో ఈ నెల 13 నుంచి 15 వరకు జరగనున్న జాతీయ స్థాయి విలువిద్య పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న నల్లి తేజేశ్వరరావు పాల్గొననున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి సోమవారం మీడియాకు తెలిపారు. విశాఖలో గత నెల 22 నుంచి 25 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగంలో ఇండియన్ రౌండ్‌లో కాంస్య పతకం సాధించిన తేజేశ్వరరావు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. విద్యార్థితోపాటు, కోచ్ గోవింద్, శివకుమార్‌లను విశాఖ ఆర్చరీ సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి, విలువిద్య సంఘం కార్యదర్శి కె.నిశాంత్‌లు అభినందించారు.

విశేషంగా పండిత సదస్సు



స్వామివారి వైభవాన్ని కీర్తిస్తున్న పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, పండితులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న భీష్మ ఏకాదశి కల్యాణమహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పండిత సదస్సు విశేషంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి, వెంకన్న ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. అర్చకులు, పండితులు స్వామివారి వైభవాన్ని కీర్తించారు. విశేష హారతులిచ్చి, భక్తులకు ప్రసాదం అందించారు. దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు భార్గవ్, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని రోడ్లను గుంతల్లేకుండా పూడ్చేస్తాం.. అంటూ సీఎం చంద్రబాబు, కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. సంక్రాంతి పోయి నెల రోజులు కావస్తోంది. నియోజకవర్గంలో రోడ్లు గోతులతోనే దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా పెందుర్తి-అక్కిరెడ్డిపాలెం-జుత్తాడ-అడవివరం మార్గంలో.. రోడ్డేదో.. గొయ్యేదో.. కూడా పోల్చుకోవడం కష్టం. ఈ రోడ్ల మరమ్మతులకు విజనరీ బాబుగారి దృష్టిలో 2047 సంక్రాంతి వరకు ఎదురుచూడాలేమోనని స్థానికులు ఛలోక్తులు విసురుతున్నారు.



వాలిమెరక జుత్తాడ సమీపంలో అధ్వానంగా ఉన్న రహదారి

ఈ రోడ్లు.. నరకానికి నకళ్లు

- ఛిద్రమైన అక్కిరెడ్డిపాలెం-జుత్తాడ రహదారి
- దారి పొడవునా గోతులు, రాళ్లు తేలిన వైనం
- వాహనాలు పాడవుతున్నాయని జనం గగ్గోలు
- రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు విడుదల చేసిన గత ప్రభుత్వం
- సాంకేతిక కారణాలు, ఎన్నికల రాకతో నిలిచిన టెండర్
- ప్రభుత్వం స్పందించి రోడ్డు పనులు చేపట్టాలని ప్రజల వినతి

పెందుర్తి: పెందుర్తి-అక్కిరెడ్డిపాలెం-జుత్తాడ-అడవివరం రహదారి. దాదాపు 15 గ్రామాలకు సంబంధించిన వేలాది మంది ప్రజల రాకపోకలకు ప్రధాన మార్గం. ఈ గ్రామాలను పెందుర్తి నుంచి అడవివరం/సింహాచలానికి దగ్గరచేసే మార్గమిదే. జంగాలపాలెం, సరిపల్లి, ముదపాక, గుర్రంపాలెం, బొడ్డు నాయుడుపాలెం, అక్కిరెడ్డిపాలెం, రాయవరపువానిపాలెం తదితర గ్రామాల వారు ఈ రోడ్డు మీదుగా సింహాచలానికి నిముషాల్లోనే చేరుకోవచ్చు. కానీ ఈ రోడ్డు నిర్మాణానికి గ్రహణం వీడలేదు. గత ప్రభుత్వం నిధులు కేటాయించాక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవడంతో పనులకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది మాసాలు దాటుతున్నా దీన్ని పట్టించుకున్న పాపాన పోవట్లేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.3 కోట్లు కేటాయింపు

రోడ్డు పరిస్థితిని తెలుసుకున్న గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీని నిర్మాణానికి రూ.3 కోట్లు నిధులు కేటాయించింది. వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో 80 అడుగుల రోడ్డు ప్రతిపాదన ఉన్నప్పటికీ, అప్పటి మేరకు 30 అడుగుల వెడల్పున రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేసింది. కొన్ని సాంకేతిక కారణాలు, ఆ తర్వాత ఎన్నికలు రావడంతో టెండర్ దశలోనే రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఖరీఫ్ సీజన్లో కురిసిన భారీ వర్షాలు, క్వారీ లారీల రాకపోకలతో ప్రస్తుతం ఈ రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. దీంతో ఇటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ముఖ్యంగా ఆటోలు, బైక్‌లు పాడవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.



అక్కిరెడ్డిపాలెం కూడలిలో పూర్తిగా ఛిద్రమైన రోడ్డు

వేలాది మందికి ఉపయోగం

పెందుర్తి-అనందపురం ప్రధాన రహదారిపై అక్కిరెడ్డిపాలెం కూడలి నుంచి జుత్తాడ, దువ్వపాలెం మీదుగా ఈ రోడ్డు అడవివరానికి కలుస్తుంది. పై గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు మండల కేంద్రం పెందుర్తికి ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అత్యవసర వైద్యం అవసరమైన సమయంలో ఆయా ప్రాంతాల ప్రజలు ఆరిలోవ మెడికల్ హబ్‌కు వేగంగా చేరుకోవాలంటే ఇదే దగ్గరి దారి. ఆయా ప్రాంతాల ప్రజలు నగర శివారు మధురవాడ, హనుమంతవాక ప్రాంతాలతో పాటు ఎంవీపీ, ఇసుకతోట చేరుకోవాలన్నా ఇంతకు మించిన ప్రత్యామ్నాయ మార్గమేదీ లేదు. దీంతో గుంతల రోడ్లలో ప్రయాణం కష్టమైనా.. ఈ రోడ్డు మీదుగానే సాగాల్సి వస్తోంది.



ఇరువైపులా కోతకు గురైన రోడ్డు

రోడ్డు కంటే.. గోతులే ఎక్కువ!

పుష్కరకాలంగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. వర్షాలతో పాటు క్వారీ లారీలు కూడా తరచూ తిరగడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ప్రస్తుతం ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాలు కూడా రాకపోకలు సాగించే పరిస్థితి లేదు. అడుగుకో గొయ్యి రహదారిపై దర్శనమిస్తుంది. రోడ్డు శిథిలమై రాళ్లు తేలాయి. రోడ్డు అంచులు చాలా చోట్ల కోతకు గురయ్యాయి. గోతుల్లో నీరు చేరితే పూర్తిగా బురదమయం అవుతుంది. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డును త్వరితగతిన బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమర్జెన్సీలో ఎంతో ఉపయోగం



నిత్యం మా ఊరి మీదుగా వేలాది మంది సింహాచలం, ఆరిలోవ ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. వైద్యం కోసం ఆరిలోవ ఆస్పత్రులకు అత్యవసరంగా వెళ్లే వారికి ఈ రోడ్డు ఎంతో ఉపయోగం. అయితే ఏదైనా భారీ వాహనం వస్తే ఎదురుగా ఉన్న బైక్ కూడా తప్పుకోలేని పరిస్థితి. ఈ రోడ్డు బాగుపడితే దూరం తగ్గడంతోపాటు వ్యయప్రయాసలు కూడా తగ్గుతాయి.

– అమరమిన్ని రాజేష్, దువ్వపాలెం

వాహనాలు పాడవుతున్నాయి



ఈ రోడ్డులో నిత్యం ఆటో నడుపుతుంటాను. ఒక్కోసారి రోజుకు నాలుగైదు సార్లు ఇదే రోడ్డులో తిరగాల్సి ఉంటుంది. ఈ రోడ్డులో ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంది. వాహనాలు కూడా తరచూ పాడవుతున్నాయి. రోడ్డు కోతకు గురవడంతో ఎదురుగా పెద్ద వాహనాలు వస్తే తప్పించేందుకు చాలా కష్టపడాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– బి.రవి, ఆటో డ్రైవర్, జుత్తాడ

ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: పారిశ్రామికవాడగా దినదినాభివృద్ధిచెందుతున్న పరవాడలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గనిశెట్టి మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం పరవాడలో ఈఎస్‌ఐ డిస్పెన్సరీ నిర్వహణ కోసం ఓ భవనం అద్దెకు తీసుకుని, ఒక రోజు కూడాడిస్పెన్సరీ తెరవకుండానే అద్దె చెల్లించారన్నారు. ఎన్టీపీసీ, ఫార్మాసిటీ పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు ఈఎస్‌ఐ వర్తింపు సౌకర్యం ఉన్నప్పటికీ స్థానికంగా ఈఎస్‌ఐ ఆస్పత్రి లేకపోవడంతో విశాఖలోని ఆస్పత్రిపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల్లో గాయపడిన కార్మికులకు స్థానికంగా అత్యవసర వైద్య సేవలు అందక, పట్టణ ప్రాంతాల్లోని ఆస్పత్రులకు తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు. పరవాడలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు వినతిపత్రం అందించి, ఆరు నెలలు కావస్తున్నా ఎలాంటి స్పందన రాలేదని ఆక్షేపించారు. కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి చేయాలని, లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని గనిశెట్టి హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు ఎస్.అప్పలనాయుడు, పి.రమణ, డి.అప్పారావు, జి.సన్యాసినాయుడు, ఎస్.అప్పారావు, ఎస్.తాతారావు పాల్గొన్నారు.

కేకేసీ అనకాపల్లి జిల్లా చైర్మన్‌గా రాము



పెందుర్తి: కాంగ్రెస్ పార్టీ అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల సంఘం(కేకేసీ) అనకాపల్లి జిల్లా చైర్మన్‌గా పెందుర్తికి చెందిన విన్నకోట రాము నియమితులయ్యారు. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాము సోమవారం మీడియాకు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతల ప్రకారం జిల్లాలోని కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

త్వరితగతిన వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టులు

- క్షేత్రస్థాయి పర్యటనలో వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్

మహారాణిపేట/పెందుర్తి: క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ వేపగుంట దరి చీమలాపల్లిలో సంస్థ చేపట్టిన కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ, విద్యుదీకరణ, శీతలీకరణ పనులను సోమవారం పరిశీలించారు. పనుల ప్రగతిని తెలుసుకున్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని, తద్వారా కన్వెన్షన్ సెంటర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారులను, అధికారులను ఆదేశించారు. చినముషిడివాడలో నూతనంగా అభివృద్ధి చేస్తున్న లేఅవుట్‌ను సందర్శించి జంగిల్ క్లియరెన్స్ పనులు, రహదారుల నిర్మాణ పనుల్ని నెలాఖరుకు పూర్తి చేయాలని సూచించారు. సంస్థ ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పిస్తున్న దబ్బంద, గండిగుండం, భాందేవపురం ఆర్.సి. లేఅవుట్లు, పాలవలస ఎంఐజీ లేఅవుట్ల పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. ఈ పర్యటనలో ఆయన వెంట ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామ, ల్యాండ్ ఎక్విజిషన్ ఆఫీసర్ వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజినీర్లు రామరాజు, సుధీర్, జీసీపీ సింగ్, ప్లానింగ్ ఆఫీసర్లు అరుణవల్లి, చామంతి, గుత్తేదారులు, తదితరులు పాల్గొన్నారు.



క్షేత్ర స్థాయి పర్యటనలో లేఅవుట్లను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, అధికారులు

'మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలి'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: గంజాయి, మద్యపానం వంటి చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. హిమ హ్యూమనిటేరియేన్ అసోసియేషన్, ఒడిశాస్టీవ్‌డోర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గోపాలపట్నం ఆళ్వార్‌దాస్ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం, నిర్మూలనపై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదివిస్తున్నారని, దాన్ని దృష్టిలో ఉంచుకుని వారి ఆశయాలను నెరవేర్చేలా, ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేయాలన్నారు. విశ్రాంత జడ్జి పైల సన్నిబాబు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం, అమ్మకం చట్టరీత్యా నేరమన్నారు. డ్రగ్స్‌కు అలవాటుపడిన వారు నేరాలు చేసేందుకూ వెనుకాడరన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల ప్రభావం లేకుండా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు స్వచ్ఛంద సంస్థలు నడుం బిగించాలని డాక్టర్ బొంగు శ్రీనివాస్ కోరారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మత్తుపదార్థాల అనర్థాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలమరశెట్టి సంతోష్, ఎస్.శ్రీనివాస్, ఆర్.మధు, ఆళ్ల తాతారావు, టి.వి.డి దాస్, జి.కె.నాయక్, ఎన్.ఫరూక్, ఆళ్వార్‌దాస్ కళాశాల కోఆర్డినేటర్ భగవాన్ పాల్గొన్నారు.

కోటేశ్వరరావుకు అదీప్‌రాజ్ పరామర్శ

సబ్బవరం: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ మళ్ల కోటేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం పరామర్శించారు. మండలంలోని ఆరిపాక పంచాయతీ పరిధి చినయాతపాలెంలోని మళ్ల నివాసానికి వెళ్లి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండి, సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, గాలిభీమవరం సర్పంచ్ గొర్లి రాజేష్, పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు బి.మహలక్ష్మినాయుడు, కోట్ని అమ్మతల్లినాయుడు, ఎస్పీ రాజు, బండారు రమణ, శరగడం రామారావు, కొటాన వెంకటరమణ, శరగడం నాగేష్, పెందుర్తి వైస్ ఎంపీపీ చిరికి దేముడు తదితరులు ఉన్నారు.



మళ్ల కోటేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని ఆరా తీస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

13న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో పలు సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఈ నెల 13న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నక్కపల్లిలోని హెటిరో ఫార్మాలో 200 ఖాళీలు, అచ్యుతాపురంలోని యెకొహోమా టైర్స్ తయారీ సంస్థలో 200 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 18–26 ఏళ్ల మధ్య వయస్సున్న, ఆసక్తిగల అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చాన్నారు. వివరాలకు 81432 77610 నంబర్లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

మాఘమాసం ప్రత్యేకతలపై ఇంటింటా ప్రచారం



దేశపాత్రునిపాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న జ్ఞాన వేదిక బృందం

పరవాడ: మాఘ పౌర్ణమి, రథసప్తమి, శివరాత్రి పండగల ప్రత్యేకతలపై త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి సభ్యుల బృందం దేశపాత్రునిపాలెంలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ మాఘ పౌర్ణమి శుక్ల చతుర్దశి నాడు శివరాత్రిగా నిర్ణయించారన్నారు. పూర్వం నిరాకార పరమాత్మకు గుర్తుగా గర్భగుడి అవసరం లేని ఈశ్వర లింగాన్ని చూపించారని పేర్కొన్నారు. మాఘ పౌర్ణమి భగవంతుని జన్మను తెలియజేస్తుందన్నారు. మాఘ మాసంలో సగుణ, నిర్గుణ పూజ విశిష్టతను తెలుసుకోవడం ద్వారా ధర్మం, అధర్మంపై విచక్షణ కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రమేష్, రమణ, లక్ష్మి, సత్యవతి, దేవి, సర్వధారి, అప్పలనాయుడు, అప్పారావు, మంగ, మల్లేషులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులి పురుగుల నిర్మూలన



సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్లో ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో పద్మజ చేతుల మీదుగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 19 ఏళ్ల లోపు వయసున్నవారంతా ఈ మాత్రలను వేసుకోవాలన్నారు. ఎంఈవో లక్ష్మణరావు, సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి ఎస్ఎస్ఆర్ చక్రవర్తి, సీహెచ్‌వో స్వర్ణలత, ఎంపీహెచ్‌వో జేసుదాసుతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి ఆధ్వర్యంలో 357 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలుఅందించారు.

రామచంద్రమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో ఈ నెల 18న నిర్వహించనున్న శ్రీ రామచంద్రమ్మ అమ్మవారి జాతర వాల్‌పోస్టర్‌ను పరవాడ మాజీ ఎంపీపీ, ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు సోమవారం ఆవిష్కరించారు. ఈ జాతరను 16, 17, 18 తేదీల్లో మూడు రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పలనాయుడు చెప్పారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బురద ముత్యాలు, గుండా నానాజీ, మండల ఉపాధ్యక్షుడు బి.అప్పలరాజు, కూండ్రపు అప్పలనాయుడు, నాయుడుపాలెం ఎంపీటీసీ కూండ్రపు అక్కయ్యమ్మ, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, కూండ్రపు అప్పారావు, ఆర్.వి.రమణమూర్తి, పెదపాటి వీరభద్రరావు, కె.తాతాజీ, బి.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న గ్రామ పెద్దలు

శాంతి భద్రతల పరిరక్షణలో మహిళా పోలీసులు కీలకం





మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్, హాజరైన మహిళా పోలీసులు

పెందుర్తి: శాంతి భద్రతలను కాపాడడంలో మహిళా పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలని పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక రాజ్యలక్ష్మి ఫంక్షన్ హాల్లో గ్రామ, వార్డు మహిళా పోలీసులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. తమ తమ ఏరియాల్లో ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి ఆ సమాచారాన్ని స్థానిక పోలీస్ స్టేషన్లకు చేరవేయాలన్నారు. యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైమ్ వంటి వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నేరాలు జరగకుండా నిరోధించడంలో ప్రజలు సహకరించేలా చైతన్యం కలిగించాలన్నారు. ప్రతీ ఇంటికి సీసీ కెమెరాలు అమర్చుకునేలా ప్రజలకు వివరించాలని సూచించారు.

ఘనంగా బంగారమ్మతల్లి పరస



రంగుల రాట్నంలో తిరుగుతున్న సందర్శకులు



బంగారమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

పెందుర్తి: మండలంలోని గొరపల్లి పంచాయతీ గంగమ్మపేటలో వెలసిన మూడూళ్ల గ్రామదేవత బంగారమ్మతల్లి పరస తొలిరోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి బంగారమ్మతల్లికి అభిషేకాలు, పూజలు జరిపారు. భక్తులు పసుపు-కుంకుమలు, చీరలు సమర్పించారు. భజన చెట్లను ఊరేగించి పూజలు చేశారు. చిన్నారులు రంగులరాట్నాలు ఎక్కి సంబరపడ్డారు. యువకులు వాలీబాల్ పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం అలరించింది.

గొరపల్లి, గంగమ్మపేట, కోట్నివానిపాలెం, కరకవానిపాలెం, గవరపాలెం, గొల్లలపాలెం తదితర గ్రామాలతో పాటు మండలంలోని వివిధ ప్రాంతాల ప్రజలు సందర్శించారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



ముత్యాలమ్మపాలెం తీరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ విష్ణు స్వరూప్, సీఐ మల్లికార్జునరావు

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో మంగళవారం జరగనున్న మాఘ పౌర్ణమి జాతర ఏర్పాట్లను పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ ఆర్.మల్లికార్జునరావు సోమవారం పరిశీలించారు. భక్తుల వసతులు, గజ ఈతగాళ్ల నియామకం, ట్రాఫిక్ నిర్వహణ, మహిళా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లపై సర్పంచ్ సీహెచ్ సుజాతముత్యాలు, ఎంపీటీసీ దేవిరవి, ఆలయ కమిటీ చైర్మన్ సోమునాయుడుతో చర్చించారు. జాతరలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీసులతో సహకరించాలని సూచించారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం సాయంత్రం వరకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.